గ్రేడ్ - I

చెడు సలహా

రచన

డా॥ యం. హరికిషన్

గ్రేడ్ – ।। సంయుక్త అక్షరాలు లేని చిన్న కథలు

చెడు సలహా

రచన

డా।। యం. హరికిషన్

కర్నూలు ప్రచురణలు

మసి కుండ

కందనవోలు అనే ఊరిని భూపాలుడు అనే రాజు పరిపాలించేవాడు

ఆ రాజు దగ్గర ఒక బంగారు హారం వుండేది.

ఆ హారం చాలా ఖరీదయింది.

ఒక రోజు అంతఃపురంలో ఎవరో ఆ హారాన్ని కాజేశారు.

ఎవరిని అడిగినా 'నాకు తెలీదు' అంటే 'నాకు తెలీదు' అన్నారు.

రాజు ఒక కుండ తెప్పించాడు. దానికి బాగా మసిపూసి వుంది.

అంతఃపురంలో పనిచేసే వాళ్ళందరినీ పిలిపించాడు.

కుండ గదిలో పెట్టి "లోపలున్నది మహిమగల కుండ. ఒకొక్కరే కళ్ళు మూసుకొని పోయి దానిని ముట్టుకోవాలి, కళ్ళు తెరవకుండా అలాగే బైటకు రావాలి. ఎవరు దొంగతనం చేసి వుంటే వాళ్ళ చేతికి మసి అంటుతుంది" అని చెప్పాడు.

ఒకొక్కరే లోపలికి పోతున్నారు.

అందరూ లోపలికిపోయి వచ్చాక రాజు అందరినీ వరుసగా నిలబెట్టి అందరి చేతులూ చూశాడు.

ఒక్క భటునికి తప్ప అందరికీ మసి అంటి వుంది.

రాజు నవ్వుతూ "అది మహిమ గల కుండ కాదు. ఏమీ కాదు. కుండను ముట్టుకున్న వారందరికి మసి అంటుతుంది. కానీ ఈ భటుడు దొంగ కాబట్టి భయపడి కుండను ముట్టుకోలేదు. అందుకే వీని చేతికి మసి అంటలేదు" అంటూ వానిని జైలులో వేశాడు.

మర్రిపండు - గుమ్మడి పండు

సుబ్బయ్య ఒకసారి ఎంతో దూరం నుండి నడిచివచ్చి అలసిపోయాడు. ఒక మర్రిచెట్టు కింద పడుకొని చెట్టు వంక చూశాడు. దానికి చిన్నచిన్న ఎర్రటి మర్రిపళ్ళు కనిపించాయి.

కొంచం దూరంలో నేలమీద ఒక గుమ్మడితీగ అంతా అల్లుకొని కనబడింది

ఆ గుమ్మడి తీగకు పెద్దపెద్ద కాయలు వున్నాయి.

సుబ్బయ్య వాటిని చూచి "ఈ దేవునికి కొంచంగూడా తెలివిలేదు. లేకపోతే ఇంతపెద్ద మర్రిచెట్టుకు ఇంత చిన్న పళ్ళేమి? అంత చిన్న గుమ్మడితీగకు అంతపెద్ద కాయలేమిటి?" అనుకున్నాడు.

కాసేపటికి సుబ్బయ్య మర్రిచెట్టుకిందే పడుకొని కళ్ళు మూసుకున్నాడు.

కొంచెం సేపున్నాక లేచాడు, వంటిమీద చాలా మర్రి పళ్ళు రాలి కనబడ్డాయి.

ఆ మర్రిపళ్ళు చూసిన సుబ్బయ్య అదిరిపడ్డాడు. "అరెరే... అనవసరంగా దేవున్ని తెలివిలేని వాడు అనుకున్నాను గానీ... దేవుడు ఎంత తెలివైనవాడు. మర్రిచెట్టుకే గనుక పెద్ద కాయలు వుండింటే అవి పడి ఇప్పటికల్లా నాతల పగిలి చచ్చేవాన్ని" అనుకున్నాడు.



ఎర్రరాయి ఉంగరం

ఒక అడవిలో ఒక జింక ఉండేది. ఆ జింకకు ఒక బంగారు ఎర్రరాయి ఉంగరం దొరికింది.

ఆ జింక దాన్ని కొమ్ములకు తగిలించుకొని సంబరంగా అటూయిటూ తిరగసాగింది. ఒక నక్క ఆ ఉంగరాన్ని చూసింది. ఎలాగయినా దాన్ని కాజేయాలని అనుకొంది. జింక పడుకున్నప్పుడు చప్పుడు గాకుండా ఎత్తుకుపోయింది. అది ఒక కోతి చూసింది.

పొద్దున లేసి ఉంగరం కోసం వెతుకుతున్న జింకతో కోతి అసలు విషయం చెప్పింది. జింక బాధపడుతూ వుంటే కోతి "బాధపడకు మోసాన్ని మోసంతోనే దెబ్బకొట్టాలి. రా నా వెంబడి" అని పిలుచుకొని పోయి జిరాఫీతో చేయవలసిన పని చెప్పింది.

జిరాఫీ వెంటనే తప్పెట తీసుకొంది. "మన రాజయిన సింహం ఎర్రరాయి ఉంగరం ఎవరో దొంగిలించారంట. దొంగను పట్టిచ్చినవారికి పదివేల వరహాలు బహుమతంట" అంటూ నక్కకు వినబడేలా దండోరా వేసింది.

నక్క అది విని అదిరిపడింది.

ఉరుక్కుంటూ జింక దగ్గరికి పోయి "ఇదిగో నీ ఉంగరం. నీవు దొంగతనం చేసింది రాజుగారికి చెబుతా" అంటూ పారిపోయింది.

కుందేలు, జిరాఫీ, జింక పడీపడీ నవ్వుకున్నాయి.

నక్క వురుక్కుంటూ.... వురుక్కుంటూ... సింహం గుహకు చేరుకొంది.

"రాజా... రాజా... నీ ఉంగరం ఎవరు ఎత్తుకుపోయారో... నాకు తెలుసు" అంది. సింహం కోపంగా "వుంగరమేంది... ఎత్తుకుపోవడమేంది! ఏం తిక్కతిక్కగా వుందా" అంటూ దాన్ని పంజాతో ఒక్క పెరుకు పెరికింది.

అంతే... నక్క మూతి పచ్చడయింది.

పిల్లోని తెలివి

ఒక ఊరిలో ఒక దొంగ వున్నాడు.

ఆ దొంగ ఒకరోజు దొంగతనం చేసి నగలన్నీ మూటగట్టుకొని ఊరి బైటకు చేరుకున్నాడు. అక్కడ ఒక లోతయిన బావి వుంది.

ఆ బావి దగ్గర ఒక మేకలు కాసే పిల్లోడు వున్నాడు. వాడు దొంగను చూశాడు.

ఆ పిల్లోడు చాలా తెలివైనవాడు. "ఎలాగైనా సరే దొంగను పట్టుకోవాలి" అనుకున్నాడు. వెంటనే గట్టిగా ఏడవడం మొదలు పెట్టాడు.

ఆ ఏడుపు విన్న దొంగ పిల్లోని దగ్గరికి వచ్చి "ఎవరునువ్వు... ఎందుకలా బాధపడుతున్నావు" అని అడిగాడు.

ఆ పిల్లోడు కళ్ళనీళ్ళు కారిపోతూ వుంటే "నా వేలికున్న బంగారు ఉంగరం బావిలో పడిపోయింది. ఇంటికి పోతే మా అమ్మ కిందామీదా ఏసి తంతుంది" అన్నాడు. దొంగకు ఉంగరం మీద ఆశ పుట్టింది.

నగలమూట గట్టున పెట్టి "నేను దిగి ఉంగరం వెదుకుతాను. అంతవరకూ ఈ మూట పట్టుకో" అంటూ తాడు పట్టుకొని లోనికి దిగాడు.

దొంగ అలా బావిలోకి దిగగానే పిల్లోడు తాడును గబగబా పైకి లాగేశాడు. దాంతో ఆ దొంగ పైకి రాలేక బావిలోనే ఇరుక్కొని పోయాడు.

వెంటనే ఆ పిల్లోడు ఉరుక్కుంటూ ఊరిలోకి పోయాడు.

జనాలందరినీ పిలుచుకొని వచ్చాడు.

వాళ్ళంతా దొంగను పైకిలాగి మెత్తగా తన్ని పోలీసులకి అప్పజెప్పారు.

చెడు సలహా

ఒక రైతు దగ్గర ఒక ఎద్దు, ఒక ఆవు వుండేవి.

ఎద్దుతో పగలంతా పొలం పని చేపించేవాడు.

ఆవుకేమో బాగా మేత వేసి సాయంకాలం పాలు పిండుకునేవాడు.

తిన్నది అరక్క ఆవుకు బాగా పొగరు పట్టింది.

ఒకరోజు ఆవు ఎద్దుతో "ఎందుకలా యజమాని ఏపని చెబితే ఆ పని నోరు మూసుకొని చేసుకుంటూ పోతావు. చెయ్యనని అడ్డం తిరుగు. ఏం చేసుకుంటాడో చూద్దాం" అంది.

తరువాత రోజు ఎద్దు రైతు తాడు పట్టుకొని ఎంత గుంజినా కదలలేదు.

దాంతో రైతుకు కోపమొచ్చి నాటుకట్టె తీసుకొని ఎద్దును చావగొట్టాడు.

ఆ దెబ్బలకు తట్టుకోలేక అది అక్కడే కూలబడిపోయింది.

దాంతో రైతుకు ఏం చేయాలో తెలియ లేదు.

పక్కనే మేత తింటూ వున్న ఆవు కనబడింది.

ఆ ఆవును పట్టుకొని పోయి బండికి కట్టాడు.

అప్పటికే ఎద్దును కొట్టడం చూసిన ఆవు భయపడి నోరు మూసుకుని బండిని లాగసాగింది.

అనవసరంగా చెడ్డ సలహా ఇచ్చినందుకు అనుభవించింది.



ఎత్తుకు పై ఎత్తు

ఒక తెలివిలేని రాజు దగ్గర ఒక చాకలి, ఒక కుమ్మరి వుండేవాళ్ళు.

చాకలాయన అంటే కుమ్మరాయనకు చాలా కోపం.

ఒక రోజు కుమ్మరాయన రాజుతో "రాజా... రాజా... మన చాకలి దేనినయినా సరే బాగా ఉతికి తెల్లగా చేయగలడు. మీ ఏనుగును పంపించండి. దానిని గూడా తెల్లగా చేసి పంపుతాడు" అని చెప్పాడు.

రాజు చాకలిని పిలిపించాడు.

ఏనుగును ఉతికి తెల్లగా చేసుకొని రమ్మని చెప్పాడు.

చాకలికి ఇదంతా కుమ్మరి చేసిన పని అని తెలిసిపోయింది.

తరువాత రోజు రాజు దగ్గరికి పోయాడు. " రాజా... ఏనుగును తెల్లగా తయారు చేయాలంటే ముందు పెద్దకుండలో వేడినీళ్ళు పోసి, దానిని బాగా నాన బెట్టాలి. మన కుమ్మరికి చెప్పి ఒక పెద్ద కుండ చేయించండి" అన్నాడు.

రాజు కుమ్మరిని పిలిచి ఏనుగు పట్టేంత పెద్దకుండ చేయమన్నాడు.

కుమ్మరి ఎంత పెద్ద కుండ చేసినా ఏనుగు కాలు పెట్టగానే అది పగిలిపోయేది.

దాంతో రాజుకు చాలా కోపం వచ్చింది.

"నా ఏనుగు తెల్లగా కాకపోవడానికి కారణం నువ్వే" అంటూ ఆ కుమ్మరిని ఊరినుంచి తన్ని తరిమేశాడు.



గాడిద మెచ్చిన పాట

గోపవరం అనే ఊరిలో శంకరయ్య అనే అతను బాగా పాటలు పాడేవాడు. శంకరయ్య పాడుతూ వుంటే ఊరంతా "శభాష్... శభాష్..." అని తెగమెచ్చుకునేవాళ్ళు. దాంతో శంకరయ్యకు తనంతవాడు ఎవడూ లేడని పొగరు బాగా పెరిగిపోయింది. ఇది విన్న ఆ ఊరి చాకలాయన ఎలాగైనా సరే శంకరయ్య పొగరు తగ్గించాలని అనుకున్నాడు.

ఒకరోజు రచ్చబండ దగ్గర జనాలంతా చేరినపుడు "శంకరయ్యా... పాట పాడి నేను చేసేపని నువ్వు చేయగలవా?" అన్నాడు.

శంకరయ్య 'సై' అన్నాడు.

ఎవరు ఓడిపోతే వాళ్ళు వెయ్యి రూపాయలు ఇవ్వాలని పందెం కాసుకున్నారు. వెంటనే ఆ చాకలాయన భయంకరంగా పాట పాడటం మొదలుపెట్టాడు. జనాలంతా ఆ దెబ్బకు చెవులు మూసుకున్నారు.

కానీ అతని పాటకు వూరిలో వున్న ఎక్కడెక్కడి గాడిదలన్నీ వురుక్కుంటూ అక్కడికి చేరి ఆనందంగా 'ఓ' అని అరవసాగాయి.

ఆ చాకలాయన నవ్వుతూ పాట ఆపేశాడు. అవి వెళ్లిపోయాయి.

అప్పుడు అతను "నువ్వు పాట పాడి ఆ గాడిదలను మళ్ళీ రప్పించు చూద్దాం" అన్నాడు. శంకరయ్య పాట పాడటం మొదలుపెట్టాడు.

శంకరయ్య బాగా పాడతాడు కాబట్టి ఎంతసేపు పాడినా ఒక్క గాడిద కూడా రాలేదు. దాంతో ఓడిపోయానని ఒప్పుకొని వెయ్యి రూపాయలు ఇచ్చి వెళ్లిపోయాడు.

జనాలంతా ఇది చూసి కిందామీదాపడి నవ్వుకున్నారు.



వట్టి మాటలతో ఏమీ రాదు !

ఒక ముసిలాయన కాలుజారి బావిలో పడ్డాడు.

''కాపాడండి... కాపాడండి'' అంటూ అరవసాగాడు.

జనాలంతా బావి చుట్టూ మూగారు.

"తాతా... కాళ్ళూ చేతులు బాగా ఆడించు. నీళ్ళను కడుపు కిందకు దొబ్బుకో తేలుతావు" అరిచాడు ఒకడు.

"తాతా... అదిగో ఆ చివర ఒక బొంగుంది చూడు. దాన్ని పట్టుకొని బైటకు రా" అరిచాడు ఇంకొకడు.

"ఎవరయినా తొందరగా పోయి తాడు తీసుకొని రాపోండి. లోపలికి వేసి లాగుదాం" అరిచాడు మరొకడు.

అలా అందరూ తలా ఒకటి చెబుతూ వున్నారే గానీ ఎవరూ బావిలోకి దిగడం లేదు. ముసిలాయనకి చేతకాక నెమ్మదిగా మునిగిపోసాగాడు.

అంతలో అటువైపు వచ్చిన భీమయ్య మునిగిపోతున్న ముసిలాయన్ని చూశాడు. "మాటలు కాదు కావలసింది చేతలు" అంటూ దభీమని బావిలోకి దుంకాడు.

ముసిలాయన్ని పట్టుకొని బైటకు తీసుకొని వచ్చాడు.

జనాలంతా భీమయ్యను చూసి సిగ్గుపడ్డారు.

గ్రేడ్ - I

చెడు సలహా

సంయుక్త అక్షరాలు లేని చిన్న కథలు



డా॥ యం. హరికిషన్